# నేటి క్రౌంచ ద్వంద్వం

సాయం సంధ్య-

అంతవరకు తనతో నడచిన పగటి వెలుగును పోగొట్టుకుని అందుతుందని అనుకున్న కొత్త వెలుగు ఇంకా అందక, అంధకారంలోకి జారుతోంది ప్రపంచం-

చుట్టూ నిండిన చీకటి చాలదన్నట్లు, పొదల్లో చేరి తమకంటూ చీకటి సృష్టించుకుని దగ్గరకు చేరి గుసగుసలాడుకుంటున్నాయి పక్షుల జంటలు.

"నిజంగా నువ్వు నన్ను ప్రేమిస్తున్నావా?" మర్రిచెట్టు కొమ్మ మీద ఒకరినొకరు అంటుకుని కూర్చునే క్రౌంచ జంటలోని మగ పక్షి అడిగింది.

"అవేం మాటలండీ...? మీ మీద ఒట్టు. మీ మీద ప్రేమ లేకపోతే ఈ చీకటిలో మీతో ఎందుకు ఉంటానండీ...?

"సారీ, ఊరకనే అడిగానంతే. ఏమీ అనుకోకే... అయినా, నాకు మొదటి నుండి ఒక అనుమానం- ఈ ప్రేమ వల్ల ప్రయోజనం ఏమిటీ...?

"బాగుంది. ప్రేమ వల్ల ప్రయోజనం ఏమిటా...?"

"ఆనందం.. శారీరకమైన మానసికమైన ఆనందం"

"నిజమే..." మగపక్షి ఆడపక్షికి మరికొంత దగ్గరగా చేరి అడిగింది "మనలో ఎవరో ఒక్కరిని వేటగాడు బాణంతో కొడితే... అప్పుడు"

"అసంభవం... మన జాగ్రత్తలో మనం ఉన్నాం కదా, ఎవ్వరూ లేనిచోట... చీకటిలో..."

"నేటి వేటగాళ్ళు కనబడరు, కనబడినా, వేటగాళ్ళలా కనబడరు. దేవుడిలా అన్నిచోట్ల నిండి వున్నారు. ఏ వాహనమైనా ఎక్కి రావచ్చు- తెలుసా..."

ఆడపక్షి మాట్లాడలేదు.

"నాకు భయం వేస్తోంది. వాడు బాణం వేస్తే... మన ఇద్దరిలో ఒకరు నేలకు ఒరుగుతే..."

"అది నేనేనైతే... అప్పుడు నువ్వు..."

"ఏం మాటలండి ఇవి...? అలా జరిగితే నేను ఉండగలనా, చెప్పండి. ఏడుస్తాను. ఏడ్చి ఏడ్చి ఎర్రమన్నవుతాను. నేను ఏడవడం చూసి ఒక వాల్మీకి రామాయణం వ్రాస్తాడు".

ఆ మాట విని మగ పక్షి ప్రేమతో ఆడ పక్షికి మరికొంత దగ్గరకు చేరింది.

"పాపం అమాయకుడు! నా మాట నమ్మినట్లున్నాడు" ఆడ పక్షి మనస్సులో అనుకుంది "నేనెందుకు ఏడుస్తాను. ఇప్పుడు నేనేం సుఖపడిపోతున్నానని- పోయిన వాడి గురించి ఏడుస్తూ కూర్చుంటే నా బ్రతుకు వృథా అవదూ...? అయినా, నేనేమైనా ఆకులు, పండ్లు తిని ఎదిగిన అలనాటి పక్షినా? చిప్స్ తిని ఎదిగి కంప్యూటర్ చిప్స్ మీద బ్రతికేదాన్ని. ల్యాప్‌టాప్ పని చేయడం మానేస్తే మరొకటి కొనుక్కోవడమేగా..."

"అలా ఉండిపోయావేంటే...? నిన్ను బాధ పెట్టేనా...?"

"లేదు లేదు. వేటగాడు నన్ను పడేస్తే ఎంత అదృష్టమని ఆలోచిస్తున్నాను. ఎవరో ఒకరు వేటగాడి బాణానికి బలి కావాల్సి వస్తే అది నేనైతేనే మంచిదేమో..." ఆడ పక్షి అంది.

"అలా అనకు. నేనది భరించలేను. నీ తోడు లేకుండా నేను ఎగరగలనా చెప్పు. నువ్వేగా నా బ్రతుకు".

గర్వంగా కళ్ళెగరేస్తూ మగ పక్షి వైపు చూసింది, ఆడ పక్షి.

కళ్ళు వత్తుకుంటున్నట్లు నటిస్తూ మగ పక్షి అనుకుంది- "ఇది లేకపోతే నేను పిచ్చివాడైపోతానని అనుకుంటోంది కాబోలు ఈ పిచ్చిది! ఇది నేలకు ఒరిగిన క్షణమే నాతో ఎగరడానికి ఎందరు లేరూ, వరుసలో...?"

రెండు క్రౌంచాలు మరికొంత దగ్గరకు చేరి వేటగాడి కోసం ఎదురు చూస్తూ కూర్చున్నాయి.

చీకటిలోకి జారే ప్రపంచం మరో వాల్మీకి కోసం ఎదురు చూసింది.

***